క్లుప్తంగా

29న టీబీ రోగులకు వైద్య పరీక్షలు



ఎక్స్‌రే వాహనం

కోసిగి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఈనెల 29వ తేదీన పోషకాహారం లేని వారి ఆరోగ్యాన్ని పరీక్షించేందుకు ఉచిత ఎక్స్‌రే వాహనం రానుందని జిల్లా క్షయ వ్యాధి సూపర్ వైజర్ యాగంటి రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి తగ్గు, గ్గళ్ల, జ్వరం, బరువు తగ్గటం, ఆకలి లేకపోవడం, ఉమ్మిలో రక్త పడటం, వంటి లక్షణాలు ఉన్న వారికి పరీక్ష చేసి ఉచితంగా ఎక్స్‌రే తీసి వైద్య సేవలందిస్తామన్నారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్స్, ఎంఎల్‌హెచ్‌పీలు గ్రామాల్లో పర్యటించి పోషకాహారం లేని పిల్లలను గుర్తించి అవగాహన కల్పించి మంగళవారం క్షయ వ్యాధి నివారణ వాహనం వద్దకు చేరుకుని వైద్య సేవలు పొందాలే చూడాలని చెప్పారు.

31నుంచి ఆరాధనోత్సవాలు

ఆదోనిఅర్బన్ : పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో ఈనెల 31 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు మంత్రాలయం రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు జరుగుతాయని ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆదివారం తెలిపారు. మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆదేశాల మేరకు మంత్రాలయం రాఘవేంద్రస్వామి 352వ ఆరాధన మహోత్సవం మంగరాయ ఆంజనేయస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ధ్వజారోహణం, గోపూజతో ప్రారంభమై సెప్టెంబర్ 2న నిర్మల్యవిసర్జనం, అష్టోత్తర పారాయణం, క్షీరాభిషేకం, ఫల పంచామృతాభిషేకం, తులసీ అర్చన, పాదపూజ, కనకాభిషేకం, రథోత్సవం, అలంకార బ్రాహ్మణుల ఆరాధన అష్టోదకం, మహామంగళహారతి, అన్నదానం కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

ఉచిత వైద్యశిబిరం

ఆదోనిఅర్బన్ : పట్టణంలో జంకన్‌వాడీ గుల్ హుసేని దర్గా వద్ద బుల్ ఉశేని చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ట్రస్టు అధ్యక్షుడు, వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్ పాల్గొని ప్రారంభించారు. శిబిరంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి డాక్టర్ ఆనంద్ వృద్ధులకు బీపీ, షుగర్ వైద్య పరీక్షలు చేశారు.

పాము కాటుతో బాలికకు అస్వస్థత

ఆదోని అర్బన్: పెద్దకడబూరు మండలం చిన్నకడబూరు గ్రామానికి చెందిన ఐశ్వర్య అనే బాలిక ఆదివారం పాముకాటుతో అస్వస్థకు గురైంది. బంధువులు స్పందించి వెంటనే ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాలిక ఇంట్లో ఉండగా పాముకాటు వేసిందని వారు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం బాలికను కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు.

ఫినాయిల్ తాగి ఆత్మహత్యయత్నం

పట్టణంలోని వాల్మీకి నగర్‌కు చెందిన వినోద్ ఫినాయిల్ తాగి ఆదివారం ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన బంధువులు వెంటనే ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు యత్నించినట్లు బంధువులు పేర్కొన్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోసిగి: మండల కేంద్రానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి స్కూటర్ అదుపు తప్పి కిందకు పడి గాయాల పాలయ్యాడు. ఆదివారం కోసిగి నుంచి కౌతాళం మండలం కరణి గ్రామానికి స్కూటర్‌పై వెళ్తుండగా స్పీడ్ బ్రేకర్‌ను తప్పించ బోయి అదుపు తప్పి కిందకు పడిపోయాడు. గాయాలతో కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా స్టాఫ్ నర్స్ రాఘవేంద్ర ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వచ్చే నెలాఖరుకల్లా 'నగరడోణ' పూర్తి

ఆలూరు: సెప్టెంబర్ నెలాఖరుకల్లా చిప్పగిరి మండలం నగరడోణ గ్రామ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను సంబంధిత కాంట్రాక్టర్ చేత పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటామని హెచ్ఎల్ఎల్సీ డీఈ మంజునాథ్ తెలిపారు. ఇప్పటికే దాదాపు 75 శాతం పనులు పూర్తయ్యాయని వివరించారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. కొన్ని అనివార్య కారణాల వల్ల పనుల్లో జాప్యం జరిగిందన్నారు. రిజర్వాయర్ రివిట్‌మెంట్, డీపీ, కట్ట పనులు పూర్తి చేశామన్నారు. కాలువలు, డీపీలు, చెరువు అంతర్భాగంలో కొన్ని పనులు చేయాల్సి ఉందన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి రిజర్వాయర్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

నాటుసారా స్వాధీనం

హొళగుంద: ఎల్లార్తి గ్రామ శివారులో ఆదివారం ఓ వ్యక్తి నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు విలేకరులకు తెలిపారు. నెరణికి తండాకు చెందిన టాక్రనాయక్ ఎల్లార్తి వద్ద నాటుసారా విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించగా నిందితుడు పరారైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఉరుకుంద..భక్తజన సంద్రం

కౌతాళం: శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగా రెండవ సోమవారం ఉరుకుంద ఈరన్నస్వామిని దర్శించుకోవడానికి ఆదివారం ఉదయం నుంచే భక్తులు తరలివస్తున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉదయం 7గంటల నుంచే భక్తులు క్యూలైన్‌లో నిలబడి స్వామిని దర్శించుకోవడంతో క్షేత్రం భక్తులతో కిటకటలాడింది. శ్రావణమాస ఉత్సవాల్లో రెండవ సోమవారం, మూడవ సోమవారాలకు ప్రత్యేకత ఉంది. ఈ రెండు వారల్లో సుమారు 6 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకునే అవకాశముంది.ఇందులో భాగంగానే రెండవ సోమవారం దర్శనార్థం కోసం ఆదివారం నుంచే భక్తులు వేలాదిగా తరలివస్తుండటంతో క్షేత్రంలో ఎటు చూసిన భక్తులతో నిండిపోయింది. భక్తుల సౌకర్యార్థం దేవాలయ అధికారులు ప్రత్యేక దర్శనంతో పాటు, శీఘ్ర దర్శనం,అతిశీఘ్ర దర్శనం,ఉచిత, విఐపీ దర్శనం ఏర్పాటు చేశారు. తెల్లవారు జామున స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ప్రత్యేక పూజల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి సన్నిధిలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.కోసిగి సీఐ ఏరిషావలి, మరో ఇద్దరు సీఐల ఆధ్వర్యంలో కౌతాళంఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి,మరో ఆరుగురుఎస్ఐలు,సిబ్బందితోబందోబస్తు నిర్వహించారు.



స్వామికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



స్వామిని దర్శనానికి క్యూకట్టిన భక్తులు



క్షేత్రం ఆవరణలో భక్తుల సందడి

రోటరీ క్లబ్ అధ్వర్యంలో క్రీడా పోటీలు



కాగడా వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



ఫుట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

ఆదోని అర్బన్: పట్టణంలో రోటరీ క్లబ్ అధ్వర్యంలో ఆదివారం క్రీడా పోటీలు నిర్వహించారు. స్థానిక అర్ట్స్ అండ్ సైన్సు కళాశాల మైదానంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ 3160 గవర్నర్ మాణిక్ ఎస్.పవార్, రీజినల్ కో అర్డినేటర్ విజయ్ నాగరాజు అసిస్టెంట్ గవర్నర్ భరత్‌షా రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఉమేష్ సాయి కాగడాను వెలిగించి పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 35 పాఠశాలల నుంచి 2,500 మంది విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు రోటరీ క్లబ్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అయా ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థిని విద్యార్థులకు భోజన వసతిని కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నితిష్ గాంధీ, అమిత్ గాంధీ, అర్ట్స్ కళాశాల కరస్పాండెంట్‌దైవాదీనం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హరికథా పారాయణం

మంత్రాలయం : మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య కార్యక్రమాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హరికథా పారాయణం నిర్వహించారు. కర్ణాటక కళాకారిణి హరికథ ప్రవచనం, కీర్తన విభావరి చేపట్టారు. కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



హరికథ పారాయణం చేస్తున్న దాస కళాకారిణి

ఘనంగా దశమి ఉత్సవాలు





పూజలందుకున్న చింతలముని, నల్లారెడ్డి స్వామి, తంగరడోణలో స్వామివారి అశ్వాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఆస్పరి: మండలంలోని తంగరడోణలో వెలసిన చింతలముని, నల్లారెడ్డి స్వాముల దశమి ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులతో తంగరడోణ గ్రామం కిటకిటలాడింది. స్వాముల ఆలయాలు వద్ద బొట్లు పేలుస్తూ ఉత్సవాలను సంబరంగా చేసుకున్నారు. స్వామి వారి ఆలయాల్లో గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మొదట గ్రామంలో వెలసిన చింతలముని ఆలయం నుంచి ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు స్వాముల అశ్వంతో పాటు చింతలముని, ఓబులేషు, బాలముని స్వాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా రెండు కిలోమీటర్ల దూరంలో కొండల్లో వెలసిన నల్లారెడ్డి స్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ నల్లారెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు చేసి తిరిగి ఊరేగింపుగా చింతలముని స్వామి ఆలయం చేరుకున్నారు. ఊరేగింపులో అడుగడుగునా స్వామివారి అశ్వానికి భక్తులు బిందెలతో నీళ్ల పోసి పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పార్వతి, సర్పంచ్ శంకరమ్మ, గ్రామపెద్దలు సీతారామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, వెంకన్న, రంగన్న, దస్తగిరి, మాబుసాబు, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలో వెలసిన చింతలాముని, నల్లారెడ్డి స్వామి చిన్న దశమి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున దేవాలయ అర్చకులు, పీఠాధిపతులు, చింతలాముని, నల్లారెడ్డి స్వాముల వారిని వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. జలాభిషేకం, తులసిఅర్చన, ఆకుపూజ, మహామంగళహారతి నిర్వహించారు. తెల్లవారు జామున స్వామి అశ్వాన్ని ఓబులేషు స్వామి ఆలయం నుంచి చింతలాముని, నల్లారెడ్డి దేవాలయం వరకు భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. అలాగే ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి మేళతాళలతో వైభవంగా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. భక్తులకు ఆలయంలో అన్నదానం చేశారు.



గోనెగండ్లలో అశ్వాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకత సంతరించుకున్న దేవరగట్టులో శ్రావణమాసం రెండవ ఆదివారం కావడంతో మాళ మల్లేశ్వరస్వామి విరాట్‌మూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారులు ఆలయంలోని మూల విరాట్‌లకు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, అర్చనతో పాటు ఇతర ప్రత్యేక పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కొందరు భక్తులు సింహాసన కట్ట నుంచి కొండపైనున్న ఆలయం వరకు మెట్టు మెట్టుకు దీపాలు వెలిగించి భక్తిని చాటుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు.



మాళమల్లేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పంట నమోదు తప్పనిసరి

హొళగుంద: ఖరీఫ్‌లో సాగు చేసిన ప్రతి పంటను రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని చిన్నహ్యాట ఆర్బీకే వీఏఏ తస్లీమా సూచించారు. ఆదివారం చిన్నహ్యాట గ్రామ పరిధిలో రైతుల పొలాల్లో ఈ–క్రాప్ బుకింగ్ చేసిన ఆమె మిగతా రైతులకు అవగాహన కలిగించారు. ఈ క్రాప్ నమోదు చేయించుకుంటే పంటల బీమా, నష్ట పరిహారం తదితర ప్రభుత్వ రాయితీలు, పథకాలు వర్తిస్తాయన్నారు. అలాగే రుణాల ప్రణాళిక, వ్యవసాయ ప్రణాళిక తదితర వాటికి పంటల నమోదు తోడ్పడుతుందని చెప్పారు. ఈ–క్రాప్ నమోదు చేయించుకునేందుకు రైతులు పొలం వన్‌బీ, బ్యాంకు ఖాతా బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పాటు ఈ పంట నమోదు దరఖాస్తు పూరించి ఇవ్వాలని సూచించారు.

మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడుకుందాం

ఆదోనిరూరల్ : మతోన్మాదుల నుంచి దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కె.అజయ్‌బాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై దేశాన్ని కాపాడుకుందామన్నారు. సెప్టెంబర్ 2న ఆలూరులో సీపీఐ బస్సు యాత్ర చేపడుతున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ సీనియర్ నాయకులు బసాపురం గోపాల్, పట్టణ సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాగరాజు, ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి దస్తగిరి, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు షేక్షావలి పాల్గొన్నారు.

పాఠశాల వేళల్లో కార్యాలయాలకు రావొద్దు

కోసిగి: మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు పాఠశాల వేళల్లో మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం, ఇతర కార్యాలయాలు రాకూడదని ఎంఈఓ నాగేశప్ప సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో పని ఉందనే సాకుతో పాఠశాలలకు డుమ్మా కొడుతున్నారని వివర్శలు వస్తున్నాయన్నారు. పాఠశాల వేళల్లో కార్యాలయాల్లో పని ఉందని చెప్పి వచ్చేవారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పాఠశాల సమయం ముగిసిన తర్వాత కార్యాలయాలకు రావాలని పేర్కొన్నారు.

విద్యా సామగ్రి, సరుకుల పంపిణీ

ఆదోని సెంట్రల్: పట్టణంలో నిరాదరణకు గురైన విద్యార్థులకు విద్య సామగ్రితో పాటు పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను ఫెయిత్ హోమ్ నిర్వాహకులకు కళాభారతి స్వచ్ఛంద సంస్థ నంద్యాల వారు ఆదివారం అందజేశారు. సంస్థ అధ్యక్షుడు వాసగిరి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ హెచ్ఐవీ పాటిటివ్ కలిగిన విద్యార్థులు వాటిని భుజించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరగుతుందని తెలిపారు. అలాగే.. లిటిల్ డాప్స్ చారిటీ ట్రస్ట్ యుకే వారి సహయంతో ఆదోని, కోడుమూరు, గూడురు, మంత్రాలయం మండలాల్లో అదరణ లేని పిల్లలందరికీ అందజేశామని చెప్పారు. ఫెయిత్ హోం డైరెక్టర్ డానియేల్ ప్రేమ్‌కుమార్, సంస్థ బోర్డు సభ్యురాలు గుజరాతి వరలక్ష్మి, మండల కో ఆర్డినేటర్ రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరాధనోత్సవాలు





పూజలందుకున్న చింతలామునిస్వామి , ఆలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేసిన దృశ్యం

ఆదోనిరూరల్ : మండలంలోని మాంత్రికి గ్రామంలో కొలువైన చింతలామునిస్వామి వారికి శ్రావణ శుద్ధ దశమి ఆరాధనోత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి పంచామృతాభిషేకం, నిత్య పూజలు చేపట్టారు. అనంతరం గ్రామంలోని యువకులు కాలినడక ద్వారా తెచ్చిన తుంగభద్ర నదీ జలాలతో అన్ని దేవాలయాల్లోని స్వామి వార్లకు జలాభిషేకం జరిపించారు. చింతలామునిస్వామి ఆలయం నుంచి గ్రామ వీధుల ద్వారా ఆంజనేయస్వామి దేవాలయం వరకు పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం చింతలముని స్వామి ఆలయం చేరుకొని స్వామివారిని నదీ జాలాలతో అభిషేకించారు. భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రారంభానికి సిద్ధంగా..

కోసిగి: మండలంలోని పెద్దభూంపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో చేపట్టిన సచివాలయ కార్యాలయ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు గ్రామ నాయకులు గట్టు భీముడు, లక్ష్మిరెడ్డి తెలిపారు. పెద్దభూంపల్లి, చిన్న భూంపల్లి గ్రామ ప్రజలకు అందుబాటులో సచివాలయ కార్యాలయం ఉంటుందని చెప్పారు.



పెద్దభూంపల్లిలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గ్రామ సచివాలయ భవనం

ఖాతాదారుల నమ్మకంతోనే బ్యాంకు అభివృద్ధి

ఆదోనిఅర్బన్ : ఖాతాదారుల నమ్మకమే తమ ప్రియదర్శిని అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంకు అభివృద్ధి అని బ్యాంకు చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రియదర్శిని బ్యాంకు 26వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖాతాదారులకు తక్కువ వడ్డీకే రుణాలు అందజేసి వారి ఎదుగుదలకు కృషి చేస్తున్నామని చెప్పారు. అలాగే బ్యాంకు మూలధనం ఈ యేడాది మార్చి నాటికి రూ.1.78 కోట్లు కాగా, బ్యాంకు డిపాజిట్‌లు రూ.47.69 కోట్లుగా ఉందన్నారు. డిపాజిట్ల భద్రతను దృష్టిలో ఉంచుకొని రిజర్వ్ బ్యాంకు ఆదేశాల మేరకు డీఐసీజీసీ వద్ద డిపాజిట్లన్నింటినీ పూర్తిగా ఇన్సూర్ చేశామన్నారు. బ్యాంకు రుణాలు రూ.31.99 కోట్లు కాగా, బ్యాంకు నిరంక ఆస్తులు (గ్రాస్) 2.31 శాతంగా ఉందన్నారు. బ్యాంకు వైస్ చైర్మన్ ఎం.లక్ష్మణ్‌రావు, డైరెక్టర్‌లు కె.దీపక్, నరేంద్ర కుమార్ డిషా, హెచ్.దశరథ రామిరెడ్డి, సీఈఓ కె.రమేష్, ఖాతాదారులు పాల్గొన్నారు.

కాటేసిన కరెంట్..

- పొలంలో గుంటక పాస్తుండగా.. విద్యుదాఘాతంతో ఎద్దు మృతి
- అప్రమత్తతో ప్రాణాలతో బయటపడిన రైతు

మంత్రాలయం : మండల కేంద్రంలోని జర్నలిస్టు కాలనీ సమీప పొలంలో ఆదివారం గుంటక పాస్తుండగా విద్యుత్ షాక్‌తో ఎద్దు మృత్యువాత పడింది. పట్టణానికి చెందిన కురువ లక్ష్మయ్య పొలంలో గుంటక పాసేందుకు కురువ వెంకటేష్ ఎద్దులను బాడుగకు తీసుకెళ్లారు. గుంటక పాసే క్రమంలో పొలం గట్టునే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు ఎద్దు కాలు తాకింది. అయితే ఎర్త్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌తో అక్కడికక్కడే మృత్యువాత పడింది. అనుకోకుండా ఎద్దు తూలిపడటంతో రైతు అప్రమత్తమై ఎద్దును తాకకుండా దూరంగా వెళ్లిపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. రూ.70 విలువ జేసే ఎద్దు మృత్యువాత పడటంతో రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



మృతిచెందిన ఎద్దుతో రైతు, కూలీలు

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

గోనెగండ్ల: ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రాంలో భాగంగా గతేడాది ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కార్యక్రమంలో గోనెగండ్ల ఏపీ స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టు ఉత్తమంగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ఆ పాఠశాల ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ ఆదివారం తెలిపారు. ఈనెల 28, 29, 30 తేదీలలో రాష్ట్రస్థాయిలో విజయవాడలో జరగబోయే బూట్ మరియూ గ్రాండ్ ఫినాలేకు తమ పాఠశాల విద్యార్థులు హాజరై సైన్స్ ప్రాజెక్టును ప్రదర్శించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.నమూనా ప్రాజెక్టును రూపొందిచిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు ప్రవంతి, అస్మంజు, సంధ్య, రాధిక, రాయినా అప్సనాలను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.



నమూనా ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న గోనెగండ్ల మోడల్ స్కూల్ విద్యార్థినులు

కేజీబీవీ, మోడల్ స్కూల్ తనిఖీ

పత్తికొండ రూరల్: స్థానిక కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్‌ను సమగ్ర శిక్ష జిల్లా బాలిక శిశు అభివృద్ధి అధికారిణి సునీత ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారంగా భోజనం అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటంపై నిర్వాహకులపై మండిపడ్డారు. కూరగాయలను కడగకుండా వండేందుకు సిద్ధం చేస్తున్న సిబ్బందిని మందలించారు. కూరగాయలను శుభ్రంగా కడిగిన తరువాతనే వంటకు ఉపయోగించాలని, వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.




విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారిణి సునీత

కార్డులకు చెల్లు

- ఇక నుంచి డ్రైవింగ్, ఆర్‌సీ డిజిటల్ కార్డులే చెల్లుబాటు
- అమలులోకి నూతన నిబంధన
- డివిజన్‌లో ఇప్పటివరకు 34 వేల కార్డులు పెండింగ్



ఆదోని ఆర్‌టీవో కార్యాలయం



డ్రైవింగ్ లైసెన్సు కార్డు

ఆదోనిఅర్బన్ : డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్‌సీ కార్డు) పొరపాటున ఇంటి వద్ద మరిచిపోయి వాహనంతో రోడ్డుపైకి వచ్చినా పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఫైన్ వేస్తారని ఇక నుంచి భయం అక నుంచి అక్కర్లేదు. ఇప్పటి వరకు ఉన్న ప్రింట్ కార్డులకు కాలం చెల్లింది. కేవలం డిజిటల్ కార్డులుంటే చాలని ప్రభుత్వం చెబుతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అన్నింటా డిజిటలైజేషన్ అమలు చేస్తున్న నేపథ్యంలో రవాణా శాఖ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. డ్రైవింగ్, ఆర్‌సీ కార్డుల స్థానంలో సంబంధిత యాప్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న పత్రం చూపితే సరిపోతుంది. రవాణా శాఖకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం వాహన్ పరివార్ సేవలన్నీ ఇప్పటికే ఆన్‌లైన్ అయ్యాయి. దీంతో చాలా రాష్ట్రాల్లో కార్డులు తొలగించి డిజిటల్ పత్రాలను అమలులోకి తీసుకొచ్చింది. ఈ డిజిటల్ సేవలను ఈనెల 4వ తేదీ నుంచి మన రాష్ట్రంలో కూడా ప్రారంభించారు. లైసెన్సు, ఆర్‌సీ కార్డుల జారీకు రూ.200, పోస్టల్ చార్జీల కోసం రూ.35 తీసుకొని పోస్టల్ ద్వారా నేరుగా ఇంటికి పంపేవారు. కార్డులు ప్రింట్ గాకపోవడం, పోస్టల్ ఆలస్యం వంటి కారణాలతో రెండు మూడు నెలలైనా కార్డు చేతికి రాని పరిస్థితి. ఇలా ఇప్పటివరకు డివిజన్ పరిధిలోని 34 వేల ఆర్‌సీ, డ్రైవింగ్ కార్డులకు ఫీజులు వసూలు చేశారు. దీంతో వాటి వరకు ప్రింట్ చేసి వాహనచోదకులకు పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు.

34 వేల కార్డులు పెండింగ్..

డివిజన్ పరిధిలో 32 వేల కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. 2022 జనవరి నుంచి 2023 ఆగస్టు 4వ తేదీ వరకు ఆర్‌సీ కార్డులు 28 వేలు, 6 వేల డ్రైవింగ్ లైసెన్సులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి కార్డుకు రూ.200, పోస్టల్ చార్జీలకు రూ.35 రవాణా శాఖ వసూలు చేసింది. పెండింగ్‌లో ఉన్న వాటికి కార్డులు పంపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అయినా కూడా కార్డు రాకపోయితే యాప్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

ఈ యాప్‌ల నుంచి డిజిటల్ పత్రాలు..

రవాణాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రవాణాశాఖ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్:// ఏపీఆర్‌టీఏసీసిటిజన్, ఈ ప్రగతి, ఓఆర్‌టీ, నెక్ట్స్‌జెన్ ఎంపరివాహన్, డీజీలాక్ యాప్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని ధ్రువపత్రం తీసుకోవాలి. లేదా ఏపీఆర్టీఏ సిటిజన్ ఆండ్రాయిడ్ మొబైల్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. వాహనాలు తనిఖీ చేసేటప్పుడు పోలీసు లేదా రవాణా అధికారులకు డౌన్‌లోడ్ చేసిన పత్రాలు చూపితే సరిపోతుంది. వీటిని అనుమతించాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. పెండింగ్‌లో ఉన్న కార్డుదారులకు కూడా కార్డు వచ్చేంతవరకు ఈ యాప్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న పత్రాలను చూపించవచ్చని ఆర్టీఓ అధికారులు చెబుతున్నారు.

ఇకపై కార్డుల పంపిణీ ఉండదు



ఇక నుంచి రవాణాశాఖ జారీచేసే ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్సుల కార్డులు పంపిణీ ఉండదు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న కార్డులను ప్రింట్ చేసి త్వరలో వాహనదారులకు అందజేస్తాం. డ్రైవింగ్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు రవాణా శాఖ యాప్ నుంచి పత్రం డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది.

– సిసిరాదీప్తి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌చార్జి ఆర్టీఓ